
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5**
శనివారం 10 ఆగస్టు 2024



గ్రామాల్లో వనమహోత్సవం

మల్యాల, ఆగస్టు 9: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అన్నా గ్రామాల్లో వనమహోత్సవం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మొక్కలు నాటారు. ముత్యం పేటలో నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్డీవో రఘువరన్ పాల్గొన్నారు. స్వశక్తి మహిళలు, ఉపాధి కూలీలతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఎంపీవో ప్రవీన్, ఏపీవో శ్రీనివాస్, ఈసీ మనోజ్, పంచాయితీ కార్యదర్శి స్వప్న అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఓగులాపూర్‌లోనూ వనమహోత్సవం నిర్వహించి గ్రామస్తులతో కలిసి అధికారులు మొక్కలు నాటారు.

గురుకులం కలకలం



- పెద్దాపూర్ పాఠశాలలో వరసగా విషాద సంఘటనలు
- 15 రోజుల్లో ఇద్దరు విద్యార్థుల మృతి
- మరో నలుగురు అస్వస్థత
- పాముకాటే అని వైద్యులు, తల్లిదండ్రుల్లో అనుమానాలు
- ఆందోళన చెందుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



విద్యార్థి మృతదేహాన్ని పరిశీలిస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, మాజీ జడ్పీచైర్‌పర్సన్ వసంత

జగిత్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో చదివే విద్యార్థులకు భద్రత కరువవుతోంది. 15రోజుల్లో ఇద్దరు విద్యారులు మృత్యువాత పడటం మరో నలుగురు అస్వస్థతకు గురి కావడంతో ప్రతి ఒక్కరినీ ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా జిల్లాలోని పెద్దాపూర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాల రేకుల షెడ్లు, శిథిల భవనాలు, పాత కట్టడాలు, అస్తవ్యస్తంగా కిటికీల వ్యవస్థ కొన సాగుతోంది. గురుకుల పాఠశాల ఊరికి దూరంగా ఉంది. చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ పరిసరాలు చెట్లు, పొదలు, పక్కనే పొలాలు ఉండడంతో పాములు గురుకులం భవనంలోకి చేరినట్లుగా అనుమానిస్తున్నారు. నిర్వహణ సరిగా చేయలేకపోవడం వల్లనే పాములతో సహవాసం చేయాల్సి వస్తుందని పరిస్థితి బట్టి అర్థమవుతోంది. గురుకుల పాఠశాల ఆవరణలో పాములు సంచరిస్తుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. గురుకుల విద్యార్థులు పాములతో సహ వాసం చేయాల్సి రావడం అధికారుల పర్యవేక్షణ లోపానికి నిదర్శనంగా మారింది. పక్షం రోజుల వ్యవధిలో పెద్దాపూర్ గురుకుల పాఠశాలల్లో ఇద్దరు విద్యార్థులు అనుమానస్పదంగా మృతి చెందడం, మరో నలుగురు అస్వస్థతకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. మృతి చెందిన ఇద్దరు విద్యార్థులు పాముకాటుకు గురయ్యారన్న అనుమానాలు వ్యక్తం అవుతు న్నాయి. అయితే గురుకుల పాఠశాల అధికార వర్గాలు గానీ, వైద్యులు గానీ ఈ విషయాన్ని స్పష్టం చేయడం లేదు. అంతర్గతంగా వైద్య వర్గాలు పాము కాటు వల్లే మృతి చెందినట్లుగా భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. సంఘటనతో అప్రమత్తమైన అధికారులు జేసీబీ వాహనంతో ఆవరణను శుభ్రం చేస్తుండగా ఓపాము సంచరిస్తుండడం గుర్తించడం అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది.

విద్యార్థుల మృతి దురదృష్టకరం..

పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో పక్షం రోజుల వ్యవధిలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడం దురదృష్టకరమని జిల్లా అదనపు కలెక్టర్ రాం బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 26వ తేదీన రాజా రపు గనా ధిత్య, తాజాగా అనిరుధ్ మరణించడం విచాకరమన్నారు. పాఠ శాలలో మౌలిక వసతుల కల్పనకు రూ. 15 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ప్రకటించారు. రానున్న నెల రోజుల్లో మౌలిక వసతులన్నీ కూడా పూర్తి చేస్తామని తెలిపారు.

మొన్న ప్రిన్సిపాల్ సస్పెన్షన్.. నేడు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కు మెమో...

గురుకుల పాఠశాలలో గతనెల చివరి వారంలో జరిగిన సంఘటనలో ప్రిన్సిపాల్ విద్యాసాగర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ సత్య ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థి గణాదిత్య మృతి చెందడం, మరో ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురికావడం సంఘటనలో ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వలేదన్న కారణంతో విద్యాసాగర్‌ను సస్పెండ్ చేశారు. తాజాగా పాఠశాల విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి, తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలల జగిత్యాల జిల్లా కన్వీనర్ పి. శ్రీనివాస్‌లపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ ఉన్నతా ధికారులు మెమో జారీ చేశారు.

15 రోజుల్లో అనుమానాస్పదంగా ఇరువురు మృతి...

జిల్లాలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలల్లో 15 పక్షం రోజుల్లో అను మానస్పదంగా ఇరువురు విద్యార్థులు మృతి చెందడం కలంకలం రేపింది. గత నెల 27వ తేదీన పాఠశాలలోని ఓగదిలో నిద్రిస్తున్న ఎనిమిదో తరగ తికి చెందిన విద్యార్థి రాజారపు గనాధిత్య(13) అస్వస్థతకు గురికాగా ఆసు పత్రికి తరలించే లోపే మృతి చెందాడు. అదే రోజు అదే గదిలో నిద్రిస్తున్న గణేష్, హర్షవర్ధన్‌లు అస్వస్థతకు గురయ్యారు. వీరిని పాముకాటుకు గు రైనట్లుగా వైద్యులు అనుమానించి నిజామాబాద్, హైద్రాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా ఇటీవల కోలుకున్నారు. ఈ సంఘటన మరవక ముందే తాజాగా పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి అనిరుధ్ అస్వస్థతకు గురికాగా కోరుట్ల ఏరియా ఆసుపత్రికి, వైద్యుల సలహామేరకు జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి మరణించాడు. విద్యార్థి మృతికి పాముకాటు కారణమని వైద్యులు, తల్లిదండ్రులు అనుమానిస్తున్నారు. 6వ తరగతికి చెందిన మరొక విద్యార్థి మోక్షిత్‌కు కడుపునొప్పి రావడంతో తొలుత మెట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే మోక్షిత్ పాముకాటుకు గురై ఉంటాడని వై ద్యులు అనుమానించి పాముకాటు విరుగుడు ఇంజక్షన్లను ఇచ్చి నిజామాబాద్‌కు తరలించారు. ఇదే సంఘటనలో 6వ తరగతికి చెందిన ఇంకొక విద్యార్థి హేమంత్ యాదవ్ సైతం కళ్లు తిరిగి అస్వస్థతకు గురయ్యాడు. హేమంత్‌ను మెట్‌పల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి, మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల అస్వస్థత పై అనేక అనుమానాలు తలెత్తుతున్నప్పటికీ వైద్య వర్గాలు పాముకాటు అనుమానంతో జాగ్రత్తలు తీసుకుంటూ సంబంధిత విరుగుడు ఇంజక్షన్లు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. కొన్ని సందర్భాల్లో కొన్ని రకాలైన పాము కాటు గాట్లు ఏర్పడకపోవచ్చని వైద్యులు అంటున్నారు. పెద్దాపూర్ పాఠశాల సంఘటన పాముకాటు గానీ, ప్రధానంగా కలుషిత పాలు సేవించడం వల్ల గానీ జరిగి ఉండవచ్చన్న అభిప్రాయాలను వైద్యులు వ్యక్తం చేస్తున్నారు.

ఘటనకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్

మెట్‌పల్లి రూరల్ : మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలోని ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబును ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ఆదేశించారు. శుక్రవారం గురుకుల పాఠశాలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావుతో కలిసి సందర్శించారు. విద్యార్థి అనిరుధ్ మృతి చెందడం, మరో ఇద్దరు అస్వస్థతకు గురవ్వడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల సమస్యలను తెలుసుకుని అదనపు కలెక్టర్‌కు తెలిపి వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యంగా వ్యవ హరించిన సిబ్బందిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజి రెడ్డి, పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, సంతోష్‌రెడ్డి, పరాంధాం, రాంప్రసాద్ పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

జగిత్యాలరూరల్/మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై మృతిచెందిన అనిరుధ్ మృతికి కారణమైనవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జగిత్యాల మాజీ జడ్పీచైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన ఎల్లారెడ్డిపేట విద్యార్థి అనిరుధ్ కుటుంబానికి, అస్వస్థతకు గురైన ఇద్దరు విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు విద్యార్థులకు అందక మృతి చెందుతున్నారని వెంటనే అధికారులు స్పందించాలన్నారు. పాఠశాలలోని ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు పాము కాటుకు గురై అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం ఒక విద్యార్థి మృతి చెందగా మరో ఇద్దరు అస్వస్థతతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. విచారణ చేపట్టి సంబంధిత వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే సంజయ్, మాజీ జడ్పీచైర్ పర్సన్ జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డిని కలిసి బాధ్యుల చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సాయిరెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది

కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో అస్వస్థతతో మృతి చెందిన విదార్థి అనిరుధ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శుక్రవారం గురుకుల పాఠశాలలో మృతి చెందిన విద్యార్థితో పాటు అస్వస్థతకు గురై చికిత్స తీసుకుంటున్న విద్యార్థుల వివరాలను విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర వెంకటేశంకు వివరించామన్నారు. ప్రిన్సిపాల్ సెక్రటరీ స్పందించి తప్పకుండా ప్రభుతం తరుపున ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రెండు వారాలలో ఇద్దరు విద్యార్థులు మృతితో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురవడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు నాణ్యమైన వైద్యం చేయించాలని, పాఠశాలలోని విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



పాఠశాల ఆవరణలో పోలీసులు, విద్యార్థుల తల్లిదండ్రులు

'విద్యార్థులకు విధులు, బాధ్యతలపై అవగాహన అవసరం'

జగిత్యాల అర్బన్, ఆగస్టు 9: విద్యార్థులకు వారి విధుల పట్ల చక్కటి అవగాహన కల్పించడంతో పాటు బాధ్యతలను నిర్వర్తించే విధానాలపై అవగాహన కల్పిస్తే సమాజంలో రాణించగలుగుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక కృష్ణానగర్‌లోగల అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల ప్రాంగణంలో అట్టహాసంగా వేడుకగా నిర్వహిం చబడిన వివిధ విభాగాల క్యాప్టెన్స్, వైస్ క్యాప్టెన్స్ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రమాణస్వీకారంలో భాగంగా విద్యార్థులచే ప్రమాణ స్వీకారం చేయించామన్నారు.. అనంతరం తోటి విద్యార్థులకు ఎన్నికైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో సీఎంఆర్ సందడి

- షాపింగ్ మాల్ ప్రారంభం
- ఆకట్టుకున్న సినీతారలు పాయల్ రాజ్‌పుత్, సంయుక్త మీనన్

కరీంనగర్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలుగు రాష్ట్రాల్లో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సీఎంఆర్ గ్రూప్ 32వ షాపింగ్ మాల్‌ను ఐఎంఏ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు, భూంరెడ్డి హాస్పిటల్స్ యజమాని డాక్టర్ వి.భూంరెడ్డి చేతుల మీదుగా కరీంనగర్‌లో అట్టహాసంగా ప్రారంభించారు. గురువారం జరిగిన షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి డాక్టర్ వి.భూంరెడ్డి, చల్మెడ మెడికల్ కళాశాల చైర్మన్ చలిమెడ లక్ష్మీనర్సింహారావు, డాక్టర్ వి.రమాదేవి, కరీంనగర్ ఆర్యవైశ్య సేవా కేంద్రం అధ్యక్షుడు, లయన్ చిదుర సురేశ్ హాజరై మొదటి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా సీఎం ఆర్ ఫౌండర్ చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ సంస్థను గత 40 సంవత్సరాలుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆదరిస్తున్నారని, కరీంనగర్‌లో 32వ షోరూంను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సీఎంఆర్‌లో ప్రపంచ స్థాయి అనుభూతి కలిగేలా ఉంటుందని అన్నారు. అన్ని రకాల వేడుకలకు అన్ని మోడల్స్‌లో కుటుంబమంతటికీ నచ్చే విధంగా వస్త్రాలు అన్ని వర్గాల ప్రజలకు అతి తక్కువ ధరలకే అందించడం మా ప్రత్యేకత అన్నారు. సొంత మగ్గాలపై నేయించిన వస్త్రాలను మార్కెట్ లో మరెవ్వరూ ఇవ్వని ధరలకు సీఎంఆర్‌లో అందిస్తున్నా మని చెప్పారు. సీఎంఆర్ ఎండీ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ సీఎంఆర్ అంటే ది వన్ స్టాప్ షాప్ అంటే ఫ్యామిలీ అందరికీ నచ్చే విధంగా అన్ని రకాల వెరైటీలు, డిజైన్లు లభిస్తాయన్నారు. అందరికీ అందుబాటు ధరలలో లక్షలలో డిజైన్లలో, వేలల్లో వెరైటీలు తమ వద్ద లభిస్తాయని చెప్పారు. ప్రముఖ సినీతారలు పాయల్ రాజ్‌పుత్, సంయుక్త మీనన్ జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్ మాల్‌లోని అన్ని సెక్షన్లలో తిరుగుతూ అన్ని రకాల డిజైన్లను పరిశీలిస్తూ సందడి చేశారు. 40 ఏళ్లుగా వ్రస్త వ్యాపార రంగంలో క్వాలిటీకి, డిజైన్లకు ప్రత్యేకత నిస్తూ తెలుగురాష్ట్రాల్లో అగ్రగామిగా సీఆర్ఎస్ నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా అభిమానులను ఆటపాటలతో డ్యాన్సులతో ఉర్రూతలూగించారు.



సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ భూంరెడ్డి సతీమణి, డాక్టర్ సూర్యనారాయణ, చల్మెడ లక్ష్మీనరసింహారావు



నటీమణులను చూసేందుకు వచ్చిన అభిమానులు



ఫోగ్‌ను స్ప్రే చేస్తున్న పాయల్ రాజ్‌పుత్

అభిమానులకు అభివాదం చేస్తున్న సినీ నటి సంయుక్తామీనన్

బస్సు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 9: మండలంలోని కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై శుక్రవారం తాడికల్ గ్రామ శివారులో బైక్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు తిమ్మాపూర్ మండలం పర్లపల్లికి చెందిన ఏనుగుల శ్రీనివాస్ కేశవపట్నం నుంచి కరీంనగర్ వైపుకు బైక్‌పై వెళ్తున్నాడు. తాడికల్ శివారులో కరీంనగర్ నుంచి వరంగల్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు


అనిరుధ్ (ఫైల్)

గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేది ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతో పాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికే 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దుల్లోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్లు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్లు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, పెద్దపల్లిటౌన్, ఆగస్టు 9: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు వెబ్ సైట్ rcle.cgg.gov.in లో ఈ నెల 24 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఎలీ హోప్ టెక్నికల్ స్కిల్స్ అకాడమీ ఆధ్వర్యంలో 100 మంది అభ్యర్థులకు 90 రోజుల పాటు నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలం పూర్తయిన తర్వాత అకాడమీ వారే ఉద్యోగాలు కల్పిస్తారని తెలిపారు.శిక్షణ కాలంలో ఒక్కో అభ్యర్థికి నెలకు రూ. 4వేల చొప్పున భృతిని సంస్థ అందిస్తుందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన 18 నుంచి 25 ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదోతరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. కుటుంబ వార్షికాదాయం 5 లక్షల రూపాయలలోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 0878-2268686 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పాలిసెట్ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ టౌన్, ఆగస్టు 9: జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రభుత్వ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన ఖాళీలను పాలిసెట్-24 స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేసేందుకు అర్హులైన, ఔత్సాహిక విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ వరకు దరఖాస్తులను కళాశాల ప్రధానాచార్యులకు సమర్పించాలని, దరఖాస్తుతోపాటు ఎస్సెస్సీ మెమో, పాలిసెట్-24 ర్యాంకు కార్డు, కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఒరిజినల్ టీసీ జత చేయాలని సూచించారు. స్పాట్ అడ్మిషన్‌లో సీటు పొందిన వారు పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌నకు అనర్హులని తెలిపారు.

హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా ఖని వాసి


కొమిమెర సాయి ఆకర్ష్

కోల్‌సిటీ, ఆగస్టు 9: హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా గోదావరిఖని సీతానగర్‌కు చెందిన కొమిమెర సాయి ఆకర్ష్‌ను నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. గోదావరిఖనికి చెందిన సాయిఆకర్ష్ ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ఉస్మానియా యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఎనిమిది సంవత్సరాలుగా హైకోర్టులో న్యాయవాదిగా పని చేస్తున్నారు. క్రమ శిక్షణ, అంకిత భావాన్ని గుర్తించిన న్యాయ శాఖ హైకోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియమించింది. తన నియామకానికి కృషి చేసిన అడిషనల్ అడ్వకేట్ జనరల్ రజినికాంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సాయిఆకర్ష్‌ను ఏజీపీగా నియమించడంపై గోదావరిఖని బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

ఇల్లందకుంట, ఆగస్టు 9: మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన రేణికుంట్ల రాధమ్మ (70) చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. రాధమ్మ గురువారం ఉదయం ఇంటి ముందు జారీ పడగా తలకు తీవ్ర గాయమైంది. వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎం తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న నీటి తరలింపు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి/ఇల్లంతకుంట,ఆగస్టు9: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 3,602 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 13.846 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో వర్షాలు లేక వరద తగ్గుముఖం పట్టడంతో ఒక్క మోటార్ ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు.

రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి మిడ్ మానేరులోకి ఒక మోటార్ ద్వారా 3,150 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. గాయత్రీ పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 13 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 17.15 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 1.22 టీఎంసీల నీరు చేరింది. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో రెండు పంపుల ద్వారా 6,400 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి 6600 క్యూసెక్కుల నీటిని సిద్దిపేట జిల్లాలోని రంగనాయకసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

కాకతీయ కాలువకు కొనసాగుతున్న నీటి విడుదల

జగిత్యాల: వానాకాలం పంటల సాగు కొరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు నీటి విడుదలను శుక్రవారం అధికారులు కొనసాగించారు. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 3,000 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 3,793 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 47.25 టీఎంసీల నీరు ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువకు 3 వేల క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 10 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతున్నాయి.

మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో శిశువు మృతి


ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

సుభాష్‌నగర్, ఆగస్టు 9: జిల్లా ఆసుపత్రి ఆవరణలోగల మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో శిశువు మృతి చెందిన సంఘటన జరిగింది. వైద్యులు సిబ్బంది కారణమంటూ బంధువులు ఆందోళన చేశారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్‌కు చెందిన పల్లె ప్రదీప్ తన భార్య లావణ్యను కాన్పు కోసం ఈనెల 8న మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేర్పించాడు. అడ్మిట్ చేసిన రోజునే నొప్పులు వచ్చినప్పటికీ ప్రసవం చేయలేదని ఆరోపించారు. శుక్ర వారం ఉదయం ఆరు గంటలకు ఆపరేషన్ చేయగా ఆడ శిశువుకు జన్మనిచ్చిందని తెలిపా రు. అయితే నొప్పులు వచ్చినపుడు కాకుండా ఆలస్యంగా ఆపరేషన్ చేయడంతో గర్భంలో ఉన్న శిశువు మల మూత్రాలు మింగడం వల్ల పాప చనిపోయిందని ఆరోపించారు. డాక్టర్లు, సిబ్బంది ఆలస్యం చేయడం వల్లనే తమ పాప చనిపోయిందని ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని బాలిక మృతి


బాలిక మృతదేహం

శంకరపట్నం, ఆగస్టు 9: శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీస్‌స్టేషన్ సమీపంలో కరీంనగర్-వరంగల్ రహదారిపై తెల్లవారు జామున గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు ఒక బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు ప్రమాదంలో ఓ బాలిక తీవ్రంగా గాయపడిందని కేశవపట్నం కారోబార్ ఉదయం సమాచారం అందించారని తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లి చూడగా అప్పటికే బాలకను హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారని తెలిసిందని వారు తెలిపారు. మృతి చెందినట్లు సమాచారం తెలుసుకొని మార్చురీకి వెళ్లి పరిశీలించామని తెలిపారు. బాలిక వయస్సు 15 నుంచి 16 సంవత్సరాలు ఉంటుందని, ఆమె మతిస్థిమితం సరిగా లేనట్లుగా తెలుస్తోందని పోలీసులు తెలిపారు. కేశవపట్నం గ్రామపంచాయతీ సెక్రెటరీ నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు.

కొండగట్టు అంజన్న సన్నిధిలో శ్రావణ సప్తాహం

మల్యాల, ఆగస్టు 9: శ్రావణ సప్తాహ ఉత్సవాల్లో భాగంగా కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో శుక్రవారం స్వామి వారికి రామరక్ష స్తోత్ర అభిషేకం, గులాబి అర్చన, వేంకటేశ్వరస్వామి, అమ్మవారికి అభిషేకార్చన, నాగేంద్రునికి ప్రత్యేక అభిషేకం చేశారు. అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, ఓడి బియ్యం, వెంకటేశ్వర స్వామికి సేవా నిర్వహించారు. అనంతరం భాగవతం హరికథ చెప్పారు. ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకారంలో స్వామివారు

జాతీయ పతాకం ఎగురవేసి దేశభక్తిని చాటాలి

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



భగత్‌నగర్, ఆగస్టు 9: ప్రతీ ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న బండి సంజయ్‌కుమార్ శుక్రవారం పార్లమెంట్ పరిధిలోని బీజేపీ శ్రేణులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలు జెండాలు, ఎజెండాలు పక్కన పెట్టి ప్రతీ ఇంటికి వెళ్లి జాతీయ జెండాను ఎగిరేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. పోలింగ్ బూత్ కమిటీ మొదలు రాష్ట్ర స్థాయినాయుడి వర కు దేశభక్తిని ప్రజల్లో పెంపొందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతీ ఒక్కరు ప్రధాని మోదీ సహా దేశ భక్తుల ఫొటోలు వాట్సాప్ డీపీలుగా పెట్టుకోవాలన్నారు. పోలింగ్ బూత్ అధ్యక్షులు తప్పనిసరిగా బూత్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి జాతీయ జెండా కొనేలా చేసి పంద్రాగస్టు రోజు ఆయా ఇళ్లపై ఎగురవేసేలా అవగాహన కల్పించాలన్నారు. వంద మందికి సందేశాలు పంపించాలన్నారు. నియోజకవర్గ పరిధిలోని జాతీయ నేతల విగ్రహాలను శుద్ధి చేయాలన్నారు. ఈ నెల 12న ఉదయం పది గంటలకు కరీంనగర్‌లో నిర్వహించే తిరంగాయాత్రలో తాను పాల్గొంటానని బండి సంజయ్ తెలిపారు. పార్లమెంట్ ఎన్ని కల్లో 80 శాతం పైగా ఓట్లు పోలైన పోలింగ్ బూత్‌ల ఎంపిక పూర్తయిందని ఆ బూత్ కమిటీలను సన్మానించడంతో పాటు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు.

నేడు రాష్ట్రానికి కేంద్ర మంత్రి : కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ శనివారం హైదరాబాద్‌కు రానున్నారు. ఆదివారం కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు, అభివృద్ధి పనులను ప్రారంభించనున్నట్లు కేంద్ర మంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

రహదారిపై పడుకుని దివ్యాంగుడి నిరసన

మురికి కాలువ నిర్మాణం చేపట్టాలని వేడుకోలు


రహదారిపై పడుకొని రాజగంగారాం నిరసన

మల్లాపూర్, ఆగస్టు 9 :మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన రాజగంగారాం అనే దివ్యాంగుడు ఇంటి ఎదుట డ్రయినేజీ నిర్మాణం చేపట్టాలని శుక్రవారం గ్రామంలోని ప్రధాన రహదారిపై పడుకుని నిరసన తెలిపాడు. గ్రామంలో తన ఇంటి ముందు మురికి కాలువ కోసం తవ్విన గుంత రోజులు గడుస్తున్నా ఎలాంటి పనులూ చేపట్టకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నానని ఆవేదన వ్యక్తం చేస్తూ రహదారిపై పడుకుని నిరసన తెలిపాడు. దీంతో గ్రామంలో సుమారు అరగంట పాటు రోడ్డుకు ఇరువైపుల వాహనాలు ఎక్కడి అక్కడే నిలిచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ఇంటి ముందు ఏడాది క్రితం మురికికాలువ కోసం గుంతను తవ్వారని తెలిపాడు. దివ్యాంగుడినైన తాను ఇంటిలోంచి బయటకు రావాలన్నా పోవాలన్నా కష్టంగా ఉందన్నాడు. త్వరగా నిర్మాణం చేపట్టాలని అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఇటీవల ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అయినా ఎవరు పట్టించుకోకపోవడంతో రోడ్డుపై పడుకున్నట్లు తెలిపాడు. విషయం తెలుసుకున్న రెవెన్యూ, పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సమస్యను త్వరలోనే పరిష్కరించేలా కృషి చేస్తామని తెలపడంతో నిరసన విరమించాడు.


రాజగంగారాం ఇంటి ఎదుట తవ్విన గుంత

భూతగాదాలతో మహిళపై దాడి

ముగ్గురిపై కేసు

మల్యాల, ఆగస్టు 9: భూతగాదాల నేపథ్యంలో ఓ మహిళపై ముగ్గురు దాడికి పాల్పడగా తీవ్ర గాయాల పాలు కావడంతో దాడికి కారకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మ్యాడంపల్లికి చెందిన చిర్ర రాయమల్లు కుటుంబానికి తన వదిన చిర్ర మల్లవ్వ కుటుంబానికి కొంత కాలంగా భూతగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో మల్లవ్వ భూమిని రాయమల్లు దున్నిస్తున్నారనే సమాచారంతో మల్లవ్వ కూతురు వేములవాడ మండలం మారుపాకకు చెందిన పడిగెల బాబాయి శుక్రవారం భూమి వద్దకు వచ్చింది. దీంతో రాయమల్లు అతని భార్య మల్లవ్వ వాళ్ల కొడుకు మనోహర్ అక్కడకు వచ్చిన బాబాయిని దూషించడమే కాకుండా మనోహర్ ఆమె తలను ట్రాక్టర్‌కు బాదడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో బాధితురాలు ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


జగిత్యాలలో పాలు పోస్తున్న బల్దియా చైర్‌పర్సన్


మెట్‌పల్లిలో..


ధర్మపురిలో ...


రాయికల్ మండలం కొత్తపేట నాగాలయంలో..


కోరుట్లలో పాలు పోస్తున్న మహిళలు

భక్తి శ్రద్ధలతో నాగుల పంచమి


కొడిమ్యాలలో..

నాగుల పంచమి పర్వదిన వేడుకలు జగిత్యాల వ్యాప్తంగా అత్యంత ఘనంగా జరిగాయి. వేడుకలను పురస్కరించుకొని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్‌తో పాటు అన్ని మండలాల్లో నాగదేవత పుట్టల వద్ద మహిళల రద్దీ నెలకొంది. శ్రావణమాసంలో వచ్చిన నాగ పంచమిని పురస్కరించుకొని మహిళలు ఉదయమే నూతన వస్త్రాలు ధరించి పుట్టల వద్దల వెళ్లి పాలు పోసి పళ్ల ఫలహారాలు, పువ్వులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సుఖశాంతులు ప్రసాదించాలని నాగదేవతలను వేడుకున్నారు. చల్లంగా చూడమని నాగదేవతను కోరుకున్నారు.నాగపంచమికి తోడు శ్రావణ శుక్రవారం కావడంతో ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. ఆలయాల్లో మహిళలు ప్రత్యేక అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మపురి క్షేత్రంలోని ఆలయాలు భక్తులతో రద్దీగా అగుపించాయి. సుదూర ప్రాంతాల నుంచి చేరుకున్న అనేక మంది భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయం వద్ద గల పాము పుట్టలో, శ్రీ రామ లింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల నాగ దేవతలకు పాలు పోసిన మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు.


...ల్లపల్లిలో మహిళలు-(01జెపిఎల్09)


వెల్గటూర్‌లో..


మల్యాలలో..


సారంగాపూర్‌లో..


కోరుట్ల మండలం నాగులమ్మ దేవాలయంలో


ఇబ్రహీంపట్నం మండలం వేములకుర్తిలో..

మహిళపై పోలీసుల దురుసు ప్రవర్తన

సోషల్ మీడియాలో వీడియో వైరల్



మహిళను లాఠీతో కొడుతున్న పోలీసులు

మెట్‌పల్లి, ఆగస్టు9 (ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి పోలీసులు ఓ మహిళపై అత్యుత్సాహం ప్రదర్శించారు. సమస్య పరిష్కరించాల్సి పోయి లాఠీతో మహిళను కొట్టారు. మెట్‌పల్లి పట్టణంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం దంపతులు గొడవకు దిగారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ ఆంజనేయులు, హెడ్ కానిస్టేబుల్ అశోక్ అక్కడకు చేరుకుని భర్తతో గొడవ పడుతున్న భార్యపై దురుసుగా ప్రవర్తించారు. హెడ్ కానిస్టేబుల్ అశోక్ మహిళపై చేయి చేసుకున్నాడు. ఏఎస్‌ఐ ఆంజనేయులు ఆగ్రహంతో మహిళను లాఠీతో కొడుతూ స్టేషన్ బయటకు పంపించాడు. న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సిన పోలీస్‌లే మహిళల పట్ల దురుసుగా ప్రవర్తించడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మహిళా కానిస్టేబుల్ అక్కడే ఉన్నా ఏఎస్‌ఐ, హెడ్ కానిస్టేబుల్ అత్యుత్సాహంతో మహిళపై దురుసుగా ప్రవర్తించడం చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారం అక్కడే ఉన్న ఓ వ్యక్తి వీడియోలో బంధించడంతో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

రోగి మృతికి వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని ధర్నా

జగిత్యాలరూరల్, ఆగస్టు 9 : జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రహదారిలో గల ఓ ప్రైవేట్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ అనే మృతుడి బంధువులు శుక్రవారం ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ధర్నా నిర్వహించారు. ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ్ (49)జూలై 18 న రోడ్డు ప్రమాదంలో గాయపడగా కాలు విరగడంతో జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స నిమిత్తం కాలుకు డాక్టర్ ఆపరేషన్ చేస్తున్న సమయంలో కాలుకు ఇన్‌ఫెక్షన్ సోకిందని దీంతో మెరుగైన చికిత్సకోసం సదరు డాక్టర్ హైద్రాబాద్‌కు పంపించారని మృతుడి బంధువులు ఆరోపించారు. జగిత్యాలకు చెందిన వైద్యుడి నిర్లక్ష్యంతోనే హైద్రాబాద్‌లో లక్ష్మణ్ మృతిచెందాడని మృతుడి బంధువులు ఆరోపించారు. శుక్రవారం మృతదేహాన్ని జగిత్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఉంచి బంధవులు ధర్నా చేపట్టారు. మృతికి కారణమైన వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాజకీయ పార్టీకి యువజన విభాగం వెన్నెముక

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్


జెండా ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 9: ఏ రాజకీయ పార్టీకి అయిన బలోపేతం కావాలంటే యువజన విభాగం ప్రధానమని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన యువజన విభాగం ఆవిర్భావ వేడుకలకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో పాటు అడ్లూరి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ధర్మపురి: యువజన కాంగ్రెస్ పార్టీకి గుండె లాంటిదని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ 64వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఎగుర వేశారు. టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఉపాధ్యక్షులు వేముల రాజేష్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మణ్, ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, పాల్గొన్నారు.

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం) : పట్టణంలోని జువ్వాడి భవనంలో శుక్రవారం యూత్ కాంగ్రెస్ ఆవిర్భవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు అదేశాల మేరకు యువజన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఇండియాన్ యూత్ వేడుకలను నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణరావు, పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్‌రావు ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

మల్యాల: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మల్యాలలో ఆ పార్టీ నాయకులు సోనియాగుడి వద్ద ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్, మండల శాఖ అధ్యక్షుడు సతీష్, లక్ష్మణాచారి, శ్రీకాంత్, నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, లక్ష్మారెడ్డి, ప్రకాష్‌రెడ్డి ఉన్నారు.

కొడిమ్యాల : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట శుక్రవారం యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల అజయ్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు.

చెరువు మధ్యలో విద్యుత్ మరమ్మతులు

కాంట్రాక్ట్ ఉద్యోగి సాహసం

కోరుట్ల రూరల్, ఆగస్టు 9 : విద్యుత్ మరమ్మతులకు చెరువును ఈది సరఫరా పునరుద్ధరించి శభాష్ అని పించుకున్నాడు విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగి. కలూర్ గ్రామ శివారులోని ఉరకుంట చెరువులో ఉన్న విద్యుత్ స్థభం నుంచి 11 కేవి లైన్ ఉంది. స్థభంపై విద్యుత్ లైన్‌కు బిగించి ఉన్న ఇన్సులేటర్ పగిలి విద్యుత్ సరఫరాలో అంతరాయం రావడంతో చెరువు పూర్తి స్థాయిలో నీటి సామర్థ్యంతో నిండి ఉంది. గమనించి విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగి పని చేస్తున్న జగన్ సాహసం చేసి చెరువు సుమారు 400 గజాల వరకు చెరువు నీటిలో ఈది విద్యుత్ మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చేశాడు. జగన్‌ను గ్రామ రైతులు అభినందించంగా ఏఈ శ్రీనివాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ దేవరాజు, లైన్ మెన్ సంపత్ సన్మానించారు.

ఏజెంట్ పై కేసు

జగిత్యాలరూరల్, ఆగస్టు 9 : ఇజ్రాయిల్ పంపిస్తానని మోసం చేసిన మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌కు చెందిన పల్లికొండ మహేష్ అనే ప్రవేట్ కన్సల్టెన్సీ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై తిరుపతి తెలిపారు. బాధితుడు పెగడపల్లి మండలం శాలపల్లి గ్రామానికి చెందిన పొన్నం సాయిలు ఫిర్యాదు మేరకు పల్లికొండ మహేష్ అనే ఏజెంట్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్సై తిరుపతి తెలిపారు.

భయంతో ఇంటి దారి పట్టిన గురుకుల విద్యార్థులు

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9 : మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగిన ఘటనతో విద్యార్థులు భయాందోళనకు గురై ఇంటి దారి పడుతున్నారు. విద్యార్థి మృతి చెందిన విషయం తెలియడంతో తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాఠశాలకు చేరుకుని ఆందోళన వ్యక్తం చేశవారు. వరుసగా విద్యార్థులు మృతి చెంద డం, అస్వస్థతకు గురి కావడానికి గల కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, కనీసం గురుకుల పాఠశాలలో కనీస వసతులు కల్పించలేదని, ఆర్డీవో శ్రీనివాస్‌కు సమస్యలను తల్లిదండ్రులు తెలపారు. విద్యార్థులు కడుపునొప్పి అంటుంటే వైద్యసేవలు అందించడానికి స్టాఫ్ నర్సు అందుబాటులో లేకపోవడం విచారకరం అన్నారు. కొందరు విద్యార్థులు భయంతో, మరికొందరు రాత్రివేళ ఏమైనా ఇబ్బందులు గురైతే పట్టించుకోవడానికి వైద్య సిబ్బంది లేరని తల్లిదండ్రులు ఇంటి తీసుకెళ్లారు. జరిగిన సంఘటనపై వివరాలు తెలుసుకోవడానికి వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులతో సందడి నెలకొన్న సమయంలో పాఠశాల ఆవరణలో పాము కనిపించింది. పాఠశాల ఆవరణలో చెట్లు, పొదలు, గడ్డితో కూడుకుని పాఠశాల చుట్టూ అపరిశుభ్రంగా ఉండటంతో పాములు తిరుగుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. రెండు రోజుల క్రితం రెండు పాములను చంపినట్లు విద్యార్థులు తెలుపుతున్నారు. అక్కడే ఉన్న విద్యార్థుల పేరెంట్స్ నిర్వహకులను నిలదీశారు. వెంటనే కూలీలతో పాఠశాల పరిసరాలను శుభ్రం చేయిస్తామన్నారు.

లోన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి , ఆగస్టు 9 (ఇబ్రహీంపట్నం) : బ్యాంక్ లోన్ మేళాను వినియోదారులు సద్వినియోగం చేసుకోవాలని సెంట్రల్ బ్యాంక్ అఫ్ ఇండియా మెట్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ మహేందర్ కోరారు. శుక్రవారం పట్టణంలోని ఐక్యూ మైండ్ ఇన్‌స్టూట్ ముందు బ్యాంక్ లోన్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ బ్యాంక్ వ్యవస్థపాకులు పోచకస్ వాలా జన్మదినం సందర్భంగా లోన్స్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. బిజినెస్ లోన్, హౌజింగ్ లోన్, వెహికిల్ లోన్, గోల్డ్ లోన్ వంటి వాటితో పాటు వివిధ రకాల లోన్‌లను అతి తక్కువ వడ్డీ రేట్లకు ఇస్తున్నామని ఆయన తెలిపారు.

'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత'

జగిత్యాలరూరల్, ఆగస్టు 9 : పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని భావించినపుడే ప్రభుత్వం అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం గ్రామంలో గల డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం రూరల్ మండలంలోని గుల్లపేట గ్రామంలో నీలకంఠ రైతు ఉత్పత్తిదారు కంపెనీ లిమిడెట్ సొసైటీని ప్రారంభించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈకార్యక్రమంలో జిల్లాసంక్షేమ శాఖఅధికారి నరేష్, ఏడీఆర్ శ్రీనివాస్, నాబార్డు డీడీఎం దిలీప్‌చంద్ర, మాజీ సర్పంచ్, జక్కుల తిరుపతి, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, ఏఈ రాజమల్లయ్య మాజీ ఏఎంసీచైర్మన్ నక్కల రాధరవీందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలో స్వచ్ఛదనం-పచ్చదనం సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. పట్టణంలోని 4వ వార్డులో ఫ్రై డే డ్రై డే సందర్భంగా కౌన్సిలర్ తురగ శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటా జ్వర సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ పోచయ్య, ప్రత్యూష, మెప్మా ఆర్పీ రిజ్వానా, అంగన్‌వాడీ టీచర్ రజిత, ఆశ వర్కర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): ఇళ్లలో, షాపులలో నిల్వ ఉన్న నీటిని ఉంచకుండా ఇంటి యాజమానులు, షాపు యాజమానులు తప్పనిసారిగ జాగ్రత్తలను పాటించాలని మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ అన్నారు. స్వచదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. కమిషనర్ మోహన్ పలు వార్డులను సందర్శించారు. టెక్నికల్ అధికారి నరేష్, ఇన్‌చార్జ్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజీబ్ పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

పెగడపల్లి : ప్రతి ఒక్కరు విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛదనం పచ్చదనంలో భాగంగా పెగడపల్లి మండలంలోని అయిత్‌పల్లిలో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు.

సంక్షిప్త సమాచారం..

ధర్మపురి: మండలంలోని దొంతపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రోడ్డుప్రమాదంతో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. లక్ష్మణ్ కుటుంబసభ్యులను కాంగ్రెస్ పార్టీ పక్షాన అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రభుత్వ విప్ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బుగ్గారం: ఎమ్మెల్యే ఎలక్షన్‌లోని ఎన్నికల ప్రచారంలో బుగ్గారం మండల కేంద్రం నడిబొడ్డున ప్రభుత్వ శాశ్వత భవనాలను నిర్మిస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చానని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎంపీడీవో, తహసీల్దార్ శాశ్వత భవనల నిర్మాణం కోసం విప్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. 2.50 కోట్ల నిధులతో నిర్మించనున్న కార్యాలయాలను త్వరగా పూర్తి చేయాలన్నారు.

జగిత్యాల అగ్రికల్చర్: పట్టణంలోని పాత్రికేయులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న నిరసన దీక్ష శుక్రవారానికి ఏడో రోజుకు చేరింది. ఈ దీక్షకు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి, జిల్లా రైతు నాయకులు విక్రమ్‌రెడ్డి, ఎంఐఎం యూనుస్‌నదీమ్, హిందూ వాహిని నాయకులు వేముల సంతోష్‌తో పాటు టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు.

ధర్మపురి: సీఎం సార్ ఫీజు బకాయిలు మంజూరు చేయాలని కోరుతూ ధర్మపురి పట్టణంలోని ప్రైవేట్ కళాశాల విద్యార్థులు శుక్రవారం పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. స్థానిక శ్రీ చైతన్య, నవోదయ డిగ్రీ కళాశాల విద్యార్థులు తాము ఫీజులు కట్టలేక పోతున్నామని, వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలన్నారు.

మల్యాల: దైనందిన జీవితంలో ప్రతిఒక్కరూ ఎదుర్కొంటున్న ఒత్తిళ్లు, మానసిక సమస్యలు తదితర వాటి పట్ల పరిష్కారం కోసం ఏర్పటు చేసిన టెలీ మానస్ కార్యక్రమంపై మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు డీఎంహెచ్‌వో సాకేత్‌రెడ్డి అవగాహన కల్పించారు. మానసిక సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నం.14416ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొడిమ్యాల : అడవుల అభివృద్ధికి ప్రతీఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని కొడిమ్యాల రేంజర్ గులాం మొయినుద్దీన్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మొక్కలు నాటారు.

మెట్‌పల్లి (ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి మండలం పెద్దపూర్ గురుకుల పాఠశాల విద్యార్థుల మృతికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దొనికెల నవీన్ డిమాండ్ చేశారు.

కథలాపూర్: మండలంలోని సిరికొండలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కొమురంభీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి, మండల ఆదివాసీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు దివ్వి రాజు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

గొల్లపల్లి: అనారోగ్యాలతో బాధపడుతూ మెరుగైన వైద్యం చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తుందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని ఆర్యవైశ్య సంఘ భవనంలో ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేశారు.

కోరుట్ల: పరిసరాల పరిశుభ్రత ప్రతీఒక్కరి బాధ్యతఅని మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో వివిధ వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీపీవో ప్రవీణ్, ఏఈలు, వార్డు అధికారులు పాల్గొన్నారు.

మల్లాపూర్: స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఫారెస్టు రేంజర్ షౌకత్‌అలీ అన్నారు. మండలంలోని గుండంపల్లిలో ర్యాలీ నిర్వహించి, అనంతరం మొక్కను నాటి నీరు పోశారు. కార్యక్రమంలో ఫారెస్టు అధికారులు సురేష్‌బాబు, సత్తార్, రమాదేవి, శ్రావణ్, ప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: గొల్లపల్లి మండలంలోని గుంజపడుగు గ్రామంలో రెండు ఇళ్లల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 78 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ సిబ్బంది, మల్యాల పౌరసరఫరా క్షేత్ర స్థాయి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి శుక్రవారం పట్టుకున్నారు. పాస్తము కనకయ్య, గంధం కనకయ్యలకు చెందిన షెడ్లలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేశారు. సదరు వ్యక్తులపై 6 ఏ కేసు నమోదు చేశారు.